సిపిఎం కార్యాలయం కూల్చివేత

ఉండి : ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతూ, ప్రజలకు అండగా నిలవడం ఫలితమే సిపిఎం కార్యాలయం కూల్చివేత అని సిఐటియు మండల అధ్యక్షులు ధనికొండ శ్రీనివాస్ విమర్శించారు. మంగళవారం సాయంత్రం ఉండి మెయిన్ సెంటర్‌లోని సిపిఎం కార్యాలయాన్ని రోడ్డు విస్తరణ పనుల సాకుతో కూల్చివేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనుల పేరుతో తమ కార్యాలయాన్ని కూల్చడం దుర్మార్గమన్నారు. ఉండిలో చాలా ఆక్రమణలు ఉన్నప్పటికీ కేవలం భీమవరం రహదారిలోని సిపిఎం కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని కూల్చివేయడం దారుణమన్నారు. మండలంలోని ఐ భీమవరం మలుపులో ఒక భవంతికి మార్కింగ్ చేసినప్పటికీ ఆ భవంతి యజమాని పెద్ద భూస్వామి కావడంతో ఆ భవంతి జోలికి అధికారులు వెళ్లలేదని ఆరోపించారు. సిపిఎం కార్యాలయం అభివృద్ధికి అడ్డంకిగా లేదని తెలియజేసినప్పటికీ పోలీసులను ఆశ్రయించి జెసిబిలతో కూల్చారని, దీనిపై ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామని శ్రీనివాస్ తెలిపారు.

ప్రలోభాలకు సన్నద్ధం..!

- పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటర్లకు నోటు ఎర యత్నాలు
- దూరప్రాంతాల నుంచి వచ్చే ఓటుకు రూ.ఐదు వేలు అట
- స్థానిక ఓటర్లకు ఓటుకు రూ. మూడు వేలంటూ ప్రచారం
- గిఫ్ట్ రూపంలో బహుమతుల అందజేత అంటూ సర్వత్రా చర్చ
- పిడిఎఫ్ అభ్యర్థిపై గెలుపు కోసం నానా తంటాలు
- ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలకు ప్రలోభాల పర్వం బాధ్యతలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పెద్దల సభకు వెళ్లే ఎన్నికలను అధికార పార్టీ కలుషితం చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఆ పార్టీ నేతలు సన్నద్ధమైనట్లు పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. ఓటుకు... నోటు ఎరవేసి ఓటర్లను ప్రలోభపెట్టే ప్రక్రియకు తెరలేపినట్లు తెలుస్తోంది. పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులుపై గెలిచేందుకు అధికార పార్టీ అన్ని ఎత్తులూ వేస్తున్నట్లు సమాచారం. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు అధికార పార్టీ డబ్బు పంపకాలు చేపడుతున్నట్లు ఓటర్లలో విస్తృత చర్చ నడుస్తోంది. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికకు సంబంధించి మంగళవారం సాయంత్రం ఐదు గంటలతో ప్రచార పర్వం ముగిసింది. 27వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ ఎన్నిక పోలింగ్ జరగనుంది. ప్రచార పర్వం ముగిసి, పోలింగ్ దగ్గర పడడంతో అధికార పార్టీ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అన్ని ఏర్పాట్లలో సిద్ధమైనట్లు ప్రచారం సాగుతోంది. ఉభయగోదావరి జిల్లాలో పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి 3.14 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో ఓటర్లు హైదరాబాద్, బెంగళూరు వంటి దూర ప్రాంతాల్లో ఉన్న పరిస్థితి ఉంది. వీరంతా ఈ నెల 27వ తేదీన అధికార పార్టీ ఓటర్ల ఫోన్ నంబర్లను సేకరించి కొన్నిరోజులుగా ఆదేపనిగా ఫోన్లు చేస్తూ ఓటు వేయాలని కోరుతున్న పరిస్థితి కొనసాగుతోంది. దూరప్రాంతాల నుంచి వచ్చే ఓటర్లకు ఛార్జీల కింద సొమ్ములు ఇస్తామని, ఓటుకు... నోటు సైతం అందిస్తామని ప్రలోభపెడుతున్నట్లు ఓటర్లలో తీవ్ర చర్చ నడుస్తోంది. దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి ఛార్జీల కింద రూ.రెండు వేలు, ఓటుకు నోటు కింద మరో రూ.మూడు వేలు రూ.ఐదు వేల వరకూ చూపుతున్నట్లు అందరినోటా ప్రచారం సాగుతోంది. స్థానికంగా ఉన్న ఓటర్లకు ఓటుకు నోటు కింద రూ.మూడు వేల వరకూ ఇవ్వాలని ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా మహిళా ఓటర్లకు వెండి కుంకుమ భరిణలు ఇచ్చేందుకు ప్రలోభపెట్టేందుకు అన్ని సిద్ధమైనట్లు సైతం తెలుస్తోంది. మేధావుల సభగా శాసనమండలికి ప్రత్యేక స్థానం ఉంది. అలాంటి ఎన్నికల్లోనూ ఈవిధంగా ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలు జరగడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

ఓటమి భయమా..

ఉభయగోదావరి జిల్లాల్లో పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీకి ఓటమి భయం పట్టుకుందన్న చర్చ నడుస్తోంది. అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటమి చెందితే పాలన తీరుపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి స్పష్టమయ్యే అవకాశం ఉంది. దీంతో ఎంఎల్‌సి ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని కృతనిశ్చయంతో అధికార పార్టీ ఉందని తెలుస్తోంది. తమకు గట్టిపోటీగా ఉన్న పిడిఎఫ్ అభ్యర్థిని ఓడించాలని అన్ని ప్రయత్నాలూ చేస్తోంది. అందులో భాగంగానే ఓటర్లను ఓటుకు నోటు కింద తమవైపు తిప్పుకోవాలని చూస్తోందన్న ప్రచారం సాగుతోంది. ఓటర్లకు ప్రలోభాలు పెట్టే పంపకాలకు సంబంధించిన బాధ్యతలను కూటమి ప్రజాప్రతినిధులకు, స్థానిక నేతలకు అప్పగించినట్లు చెప్పుకుంటున్నారు. దీంతో మంగళవారం స్థానిక నేతలు తమ పరిధిలోని ఓటర్లకు ఫోన్లు చేసి, మిమ్మల్ని కలుస్తామంటూ చెప్పడంతో డబ్బులు పంపకాలపై ప్రచారం సాగుతోంది. ఓటుకు నోటుపై జనంలో తీవ్ర చర్చ సాగుతోంది. బుధవారం రాత్రి నగదు పంపకాలు ప్రక్రియ విస్తృతంగా సాగే అవకాశం ఉందని అంతా అంచనా వేస్తున్నారు. అధికార పార్టీ నగదు పంపకాలు సాగిస్తుందా..లేక ప్రజాస్వామ్యాన్ని గౌరవించి నిజాయతీగా ముందుకు సాగుతుందా కొద్ది గంటల్లో తేలిపోనుంది.

పరిశ్రమల్లో భద్రతా నిర్వహణపై అవగాహనుండాలి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రమాదకర పరిశ్రమల్లో భద్రతా నిర్వహణకు తీసుకోవాల్సిన అన్ని ముందస్తు చర్యలపైనా యాజమాన్యాలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం స్థానిక విష్ణు కాలేజీ మినీ ఆడిటోరియం వద్ద ఫ్యాక్టరీల శాఖ ఆధ్వర్యంలో 'ప్రమాదకర పరిశ్రమల్లో భద్రతా నిర్వహణ' పై ఏర్పాటుచేసిన ఒకరోజు శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొని పరిశ్రమల యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. ఉద్యోగుల్లో పారిశ్రామిక భద్రతా రంగంలో అవగాహన కల్పించడం, భద్రతా సంస్కృతిని అభివృద్ధి చేయడం కార్యక్రమం ముఖ్యోద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పరిశ్రమల ప్రతినిధులు ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని అనుసరించాలని, భద్రతా కమిటీ సమావేశాలను నిర్వహించాలని, ప్రమాదాల నివారణకు అన్ని చర్యలూ తీసుకోవాలని తెలిపారు. ప్రమాదం జరగక ముందే అన్ని ముందస్తు చర్యలూ తీసుకోవాలన్నారు. ఫ్యాక్టరీల శాఖతో కలిపి ఏర్పాటుచేసిన అధికారుల బృందం ప్రతి పరిశ్రమలో తరచూ తనిఖీలను నిర్వహించి లోటుపాట్లను యాజమాన్యాలకు తెలియజేయాలన్నారు. జిల్లాలో ఇప్పటికే తనిఖీ బృందం 90శాతం పరిశ్రమలను స్పెషల్ డ్రైవ్ ద్వారా తనిఖీ చేసి ఆదేశాలను ఇవ్వడం జరిగిందన్నారు. పరిశ్రమల యాజమాన్యం, సిబ్బంది సేఫ్టీ పద్ధతులను అలవాటు చేసుకోవాలని తెలిపారు. విజయవాడ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.శ్రీనివాసరావు ప్రమాదాల నివారణకు భద్రతా సంస్కృతిపై మాట్లాడారు. విజయవాడ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, వాన్‌బరీ లిమిటెడ్ డైరెక్టర్ ప్రభాకర్, వెస్ట్ గోదావరి ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ బి.రామకృష్ణ పాల్గొన్నారు.

27న యాజమాన్య పాఠశాలలకు సెలవు ప్రకటించాలి

జిల్లా కలెక్టర్, డిఇఒకు యుటిఎఫ్ వినతి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 27వ తేదీన ఓటర్లు ఓటు వేసేందుకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకూ సెలవు ప్రకటించాలని యుటిఎఫ్ నేతలు కోరారు. కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికు, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణకు సెలవు ప్రకటించాలని కోరుతూ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్ విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, గౌరవ అధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య, కోశాధికారి పి.క్రాంతికుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయరామరాజు, రామభద్రం మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఎంఎల్‌సి ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఓటర్లు అంతా టీచర్, గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారన్నారు. అంతా స్పెషల్ క్యాజువల్ లీవు పెట్టుకునే పరిస్థితి వస్తే పాఠశాలలు పనిచేయడం ఇబ్బందిగా మారుతుందన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్, డిఇఒ పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



దిడ్ల వీర రాఘవులు గెలుపు.. అత్యంత అవసరం

ప్రజాశక్తితో ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి - శాసన మండలిలో పిడిఎఫ్ ప్రాతినిధ్యం పెంచేందుకు మద్దతివ్వండి

ప్రజాశక్తి - భీమవరం

కేంద్రంలో పెద్దల సభగా ఉన్న రాజ్యసభ, రాష్ట్రంలో శాసనమండలిని రాజ్యాంగం ఏర్పాటు చేసింది. అయితే ఇక్కడ డబ్బున్నవాళ్లు, పెత్తందారులు, కార్పొరేట్ శక్తులు రాజ్యమేలుతున్నాయి. సామాజిక అవసరాలకు అవసరమైన చట్టాలు కాకుండా డబ్బున్న వాళ్లకు అనుకూలంగా చట్టాలు రూపొందించుకుంటాయనే ఉద్దేశంతో రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ శాసనమండలిలో కూడా మేధావి వర్గం ఉండాలని ఐదు ఉపాధ్యాయ ఎంఎల్‌సి, మరో ఐదు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సిలను ఎన్నుకునేందుకు అవకాశం కల్పించారు. అయితే ఈ పది స్థానాల్లో ఏడు స్థానాలు రాజకీయ కార్పొరేట్లు కైవసం చేసుకున్నారు. పిడిఎఫ్ ఉంటే ప్రజా సమస్యలు, సామాజిక సమస్యలతోపాటు పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నించే గొంతుకగా నిలుస్తుంది. ప్రస్తుతం జరుగుతున్న కృష్ణ, గుంటూరు గ్రాడ్యుయేట్, ఉత్తరాంధ్ర టీచర్ ఎంఎల్‌సి ఎన్నికలతోపాటు ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలు జరుగుతున్నాయి. ఇది ఎన్నికల్లో పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న వారికి రాజకీయాలకు అతీతంగా ఓట్లు వేసి గెలిపించాలని కోరుతున్నాను. 2007 నుంచి ఇప్పటివరకూ పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ప్రజాస్వామ్య విలువలు కలిగి నీతినిజాయతీగా పనిచేస్తారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత కూడా శాసనమండలిలో గొంతెత్తడంతో పాటు ప్రజా ఉద్యమాలకు ప్రత్యక్షంగా బాసటగా నిలుస్తారు. ఈ నేపథ్యంలో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతో ఉంది. రాజకీయాలకు అతీతంగా సమాజం మొత్తం గురించి ముఖ్యంగా విద్య, ఉపాధి రంగం గురించి స్వతంత్రంగా ఆలోచించగలిగి ప్రభుత్వానికి సూచనలు చేయగలిగే వ్యక్తిని గ్రాడ్యుయేట్లు అందరూ కలిసి ఎన్నుకోవాల్సి ఉంది. స్వతంత్ర మేధావులు అవసరం. అందువల్ల మేధావి వర్గానికి చెందిన గ్రాడ్యుయేట్లు మేధావి, ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయ, ఉద్యోగ కార్మిక ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించిన అనుభవజ్ఞుడు, నిజాయతీపరుడు, నిర్భయుడు అయిన దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నాను.

ఉద్యమాలే రాఘవులుకు ఊపిరి

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరం మండలం టేకి గ్రామానికి చెందిన దిడ్ల వీర రాఘవులు (డివి.రాఘవులు) ఉద్యమాలే ఊపిరిగా జీవించారు. 40 ఏళ్ల పాటు ఉపాధ్యాయునిగా పనిచేశారు. 10 ఏళ్లపాటు యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శిగా, 12 ఏళ్లు జిల్లా కార్యదర్శిగా, ఐదేళ్లు జిల్లా అధ్యక్షులుగా పనిచేశారు. మరో రెండేళ్లు రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా, రెండేళ్ల పాటు రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. 2018 నుంచి ప్రస్తుతం వరకూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెఎసి కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 40 ఏళ్ల ఉద్యోగ జీవితంలో 35 ఏళ్లు యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘంలో వివిధ బాధ్యతల్లో పనిచేశారు. యుటిఎఫ్ చేపట్టిన ప్రతి పోరాటంలో భాగస్వామిగా ఉన్నారు. ఐక్య ఉద్యమాలకు నాయకత్వం వహించి అందరిలో ఒకడిగా మెలుగుతూ ముందుకు సాగుతున్నారు.

కూటమి ప్రభుత్వ వ్యతిరేక పవనాలే పిడిఎఫ్ గెలుపునకు పునాది

కూటమి ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో అటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగుల్లో కూడా కూటమి ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి ఉంది. దీంతో పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులుకు ఓటర్లు మద్దతు లభిస్తోంది. ధన బలంతో గెలిచిన వాళ్లు వారి ఆస్తులు, సంస్థల పెంపుకోసమే పనిచేశారు తప్ప హక్కులు, సమస్యల కోసం పనిచేసిన వారు ఒక్క పిడిఎఫ్ తప్ప ఎవరూ లేరు. 2007 నుంచి సుమారు 18 ఏళ్ల పాటు పిడిఎఫ్ తరపున పోటీ చేసి గెలిచి ప్రజా సమస్యలపై పోరాడారు. అంగన్వాడీ, ఆశ, మిడ్ డే మిల్స్, వాలంటీర్లు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు, రెగ్యులర్ ఉద్యోగులతో పాటు అన్ని వర్గాల సమస్యలపై ప్రత్యక్ష పోరాటాల్లో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని హమాలీ కార్మికుల ధర్నా

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న హమాలీ కార్మికులు

ప్రజాశక్తి - తణుకు

ఎపి పౌర సరఫరాల సంస్థ హమాలీ కార్మికులకు పెంచిన కూలీ రేట్లు రూ.25 నుండి 28 రూపాయలు, 14 నెలల ఎరియర్స్ చెల్లింపునకు వెంటనే జిఒలు జారీ చేయాలని ఎపి పౌర సరఫరాల సంస్థ హమాలీస్ రాష్ట్ర యూనియన్ గౌరవాధ్యక్షులు కె.ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సివిల్ సప్లై గొడౌన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణం ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ హమాలీ కార్మికులు అందిస్తున్న సేవలకు ప్రభుత్వం నుంచి నేటికీ గుర్తింపు లేదని, ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. గత 14 నెలలుగా వేతన ఒప్పందం రేట్లు పెంపుదల చేయకుండా కాలయాపన చేయడం జరిగిందన్నారు. పెంచిన రేట్లకు జిఒలు ఇవ్వలేదని తెలిపారు. పెంచిన రేట్లు వెంటనే జిఒలు జారీ చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన పోరాటాలను ఉధృతం చేస్తామని రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఆందోళన, పోరాటాల్లో హమాలీ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మార్చి 4వ తేదీ తహశీల్దార్ కార్యాలయాల వద్ద రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే మార్చి 20వ తేదీ నుంచి సమ్మె చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, మండల కార్యదర్శి గుబ్బల గోపి, కృష్ణారావు, రాము, నాయుడు, ధనరాజు, శివప్రసాద్, సుధాకర్, పెంటయ్య, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులును గెలిపించాలి



ఉండిలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి - పెంటపాడు

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజాసంఘాల నేతలు కోరారు. మంగళవారం మండలంలోని బ్యాలెట్ నమూనా ఓటర్లకు ఇచ్చి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, బంకూరు నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకుడు చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే వ్యక్తులు పిడిఎఫ్ అభ్యర్థులని, వారిని గెలిపించుకుంటే ప్రజా సమస్యల పరిష్కారం కోసం శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీయడానికి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉపయోగపడతారని వారు తెలిపారు. అధికార పక్షం నుంచి గెలుపొందిన అభ్యర్థులు శాసనసభలో వ్యతిరేకించిన బిల్లులను శాసనమండలిలో ఆమోదింప చేయడానికే తప్ప ప్రజాసమస్యల పరిష్కారం కోసం మాట్లాడే అవకాశం వారికి ఉండదని వారు తెలిపారు. ఓటు ఉన్న ప్రతి అభ్యర్థి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని వారు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దత్తు రాము, మీసాల శ్రీనివాస్, బెతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పెనగంటి దుర్గా కరక వెంకట్రావు పాల్గొన్నారు.

గణపవరం : పట్టభద్రుల ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులను గెలిపించాలని కోరుతూ మంగళవారం గణపవరంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆటో మైకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిననాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక పీడిత ప్రజల సమస్యలపై పెద్దల సభలో ప్రశ్నించే పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటి చేసే దిడ్ల వీరరాఘవులును గెలిపించాలని కోరారు. ఈ ప్రచార యాత్ర గణపవరం, సరిపల్లి, చిన్న రామచంద్రపురం, అర్ధవరం, పిప్పర, అప్పన్నపేట, కేశవరం గ్రామాల్లో నిర్వహించారు.

తాడేపల్లిగూడెం : ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీరరాఘవులను గెలిపించాలని కోరుతూ మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండలంలోని వెంకట్రావుపాలెంలో ఓటర్లను కలిసి కరపత్రాలను అందజేస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాలుపూరి సత్యనారాయణ, కండెల్లి సోమరాజు మాట్లాడుతూ 2007లో శాసనమండలి పునరుద్ధరణ నుంచి గత 18 సంవత్సరాల కాలంలో పిడిఎఫ్ అభ్యర్థులు ఎంఎల్‌సిలుగా గెలవడం జరిగిందని, సమస్యల పరిష్కారం కోసం వారికి అండగా నిలిచేది పిడిఎఫ్ ఎంఎల్‌సిలేనని వారిని గెలిపించాలని కోరారు.

ఆకివీడు : నిరంతరం ప్రజలు, సమాజాభివృద్ధి కోసం పోరాటం జరిపే వారి గెలుపు ప్రతి ఒక్కరి విజయం అని సిఐటియు మండల అధ్యక్షులు పెంకె అప్పారావు అన్నారు. పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు గెలుపును ఆకాంక్షిస్తూ ఆయన తరపున స్థానిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. పిడిఎఫ్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

భీమవరం టౌన్ : పట్టభద్రుల పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు గెలుపు కోసం మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు బలపరిచిన దిడ్ల వీర రాఘవులు గెలుపు ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు ఎం.రామాంజనేయులు, పట్టెం శుభకర్ రావు పాల్గొన్నారు.

ఉండి: మేధావులైన పట్టభద్రులు అందరూ దిడ్ల వీర రాఘవలుకి తొలి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఉండి మండలం పాందువ్వ గ్రామంలో ఉపాధ్యాయ, సచివాలయ సిబ్బందిని కలిసి ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ సందర్భంగా మాదాసు గోపి మాట్లాడుతూ శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీయడానికి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పిడిఎఫ్ ఎంఎల్‌సిలు కృషి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, మహేంద్ర పాల్గొన్నారు.

క్యాబినెట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ఆప్కాస్ కార్మికుల ధర్నాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవరావు

ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసి ప్రయివేటు కాంట్రాక్టర్ ద్వారా పారిశుధ్య పని చేయించాలనే క్యాబినెట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. ఆప్కాస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, నూతన పిఆర్‌సి ప్రకటించి అమలు చేయాలని తెలిపారు. మంగళవారం 5వ డివిజన్ మస్టర్ ఆఫీస్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడాతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మున్సిపాల్టీలో పనిచేస్తున్న కార్మికులకు పని భారం పెరిగిందని, కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. ఇంజినీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 36 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల ఆశలకు అనుగుణంగా పరిపాలన సాగట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులు ఐక్యంగా కార్మికులపై వేస్తున్న భారాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో యూనియన్ నాయకులు నీలాపురాజు, నీలాపు అప్పన్న, పెంటా సత్యనారాయణ, మురళి, దుర్గమ్మ, కనకదుర్గ పాల్గొన్నారు.

రొయ్యల చెరువు తవ్వకం అడ్డగింత

యలమంచిలి : మండలంలోని చించినాడ గ్రామం ఏటిగట్టు దిగువన నాలుగు తూముల సమీపంలో ఉన్న దళితులకు చెందిన శ్మశాన భూమిని ఆనుకొని గ్రామానికి చెందిన రుద్రరాజు బలరామకృష్ణ, సూర్యనారాయణ రాజు, రుద్రరాజు మోహనకృష్ణ, సూర్యనారాయణ రాజు అనే రైతులు అక్రమంగా రొయ్యల చెరువును తవ్వేస్తున్నారు. మంగళవారం ఆ పనులను సిపిఎం, దళిత నాయకులు మరోసారి పనులను అడ్డుకొని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో తహశీల్దార్ గ్రంధి పవన్ కుమార్ ఆ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, మండల కమిటీ సభ్యులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, ఇతర దళిత నాయకులు మాట్లాడుతూ అధికారుల నుంచి ఎటువంటి పర్మిషన్ తీసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా రొయ్యల చెరువును తవ్వడమే చట్ట విరుద్ధమని, అలాంటిది నిబంధనలను తుంగలోకి తొక్కి ఏకంగా దళితులకు స్మశానం లేకుండా చేయాలనే కుట్రలో భాగంగా తవ్వేస్తున్నారని, ఎవరైనా మరణిస్తే గొయ్యి తీసి పూడ్చి పెట్టుకొనే పరిస్థితి ఉండదని, కనీసం ప్రభుత్వ నిబంధన ప్రకారం శ్మశానానికి 10 మీటర్లు వదులుకొని చెరువును తవ్వుకున్నా తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. దళిత నాయకులు తాడి ఉదయకుమార్, కోరం వెంకటేశ్వరరావు, బూసి రాజబాబు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఓటింగ్ రోజు స్పెషల్ క్యాజువల్ లీవ్ : కలెక్టర్

భీమవరం : తూర్పు-పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు వేయడానికి ఓటు హక్కు ఉన్న వారికి తమ ఓటును వినియోగించుకునే వీలుగా ఈనెల 27న స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను ఎన్నికల సంఘం ప్రకటించిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. 27న ఎన్నికలు నిర్వహించే పోలింగ్ కేంద్రాలకు ఏర్పాట్ల నిమిత్తం ముందు రోజు 26న కూడా స్థానిక సెలవుగా ప్రకటించడం జరిగిందని తెలిపారు.

మూడు రోజులు మద్యం షాప్‌లు బంద్

నరసాపురం: ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ కారణంగా మూడు రోజులు మద్యం అమ్మకాలు నిలిపేయాలని దుకాణదారులను పోలీసులు ఆదేశించారు. ఎన్నికల కోడ్ కారణంగా ఈనెల 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు మద్యం షాపులు బంద్ కానున్నాయి. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు నరసాపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు షాపులకు సీల్ వేసినట్లు సిఐ ఎస్.రాంబాబు తెలిపారు.

సమన్వయంతో విజయం కైవసం చేసుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం

ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి విజయం కైవసం చేసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ అన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటుతోనే గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం సాయంత్రం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు ప్రజా సంఘాల నాయకులతో ఎంఎల్‌సి ఎన్నికల రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి రాఘవులుకు విజయావకాశాలు ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రతి ఒక్కరూ మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రెండు రోజులు ఎన్నికలకు ఎంతో కీలకమని, కలిసికట్టుగా ప్రజా సంఘాలను కలుపుకొని ముందుకు సాగాలన్నారు. టీచర్ ఎంఎల్‌సి బొర్ర గోపీమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఈ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలన్నారు. అతి సామాన్యుడిగా ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జెఎన్‌వి గోపాలన్, కె.రాజా రామ్మోహన్, ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం పాల్గొన్నారు.

కేశవరం బెయిలీ వంతెన పరిశీలన

గణపవరం : ఉండి కాలువపై నిర్మించిన కేశవరం బెయిలీ వంతెనకు మరమ్మతులు చేయాలని జీవీఎల్ సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన ఫలితంగా మంగళవారం ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు, కూటమి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ బెయిలీ వంతెన శిథిలావస్థకు చేరుకుంటే వంతెన నిర్మాణం చేయడానికి దండు సత్యనారాయణ రాజు(జోన్ రాజు యువసేన) ముందుకు వచ్చారని తెలిపారు. సత్యనారాయణ రాజు ఆర్థిక సహకారంతో వంతెన పనులను పరిశీలించినట్లు చెప్పారు. ఉంగుటూరు నియోజకవర్గం కూటమి నాయకులు, గ్రామ క్షత్రియ వైద్యన్ట్ పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి ఆలయానికి డస్ట్‌బిన్లు చీపుర్లు అందజేత

భీమవరం టౌన్ : మహాశివరాత్రి సందర్భంగా గునుపూడి పంచారామ క్షేత్రమైన ఉమా సోమేశ్వర స్వామి దేవస్థానంకు స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో స్వచ్ఛతాహి కార్యక్రమంలో భాగంగా డస్ట్‌బిన్స్, చీపుర్లు, ఫినాయిల్ అందించే కార్యక్రమాన్ని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆలయ ఇఒ రామాంజనేయులు మాట్లాడుతూ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామని, ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రత పాటించాలని స్వచ్ఛంద సంస్థలు ఈవిధంగా శానిటేషన్ సామాగ్రి అందివ్వడం గొప్ప విషయమన్నారు. గత 20 ఏళ్లుగా దాతలను సమీకరించి రంగసాయి ఈ సామాగ్రిని అందించడం అభినందనీయమన్నారు.

27న సెలవు ప్రకటించాలి : సిఐటియు

భీమవరం : శాసనమండలి ఎన్నికలు 27న జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ, ప్రయివేట్ సెక్టార్లలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికులకు సెలవు ప్రకటించాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం డిఆర్‌ఒ వెంకటేశ్వర్లుకు సిఐటియు ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలం, కె.రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలు జరుగుతున్న 27వ తేదీ సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. పట్టభద్రులు వివిధ పరిశ్రమలలో, షాపుల్లో సంస్థల్లో, పనిచేస్తున్నారని, వారు ఓటు వేయడానికి రావాలంటే ప్రభుత్వం సెలవు ప్రకటించాలని తెలియజేశారు. వినతి అందించిన వారిలో సిఐటియు జిల్లా నాయకులు ఇ.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు ఉన్నారు.

రైతులకు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు

ఉండి : రైతులందరూ ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందాలంటే విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఉండి మండలం ఉప్పులూరు గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో సందర్శించిన జెడ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులందరికీ ఆధార్ తరహాలో కేంద్ర ప్రభుత్వం 14 అంకెల విశిష్ట సంఖ్యను తీసుకువచ్చిందన్నారు. ప్రస్తుతం సొంత పొలాలు ఉన్న రైతులకు విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని, తర్వాత కౌలు రైతులకు కూడా రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఆకివీడు వ్యవసాయ సహాయ సంచాలకులు కెఎస్ఎస్.శ్రీనివాసరావు, ఉప్పులూరు రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యం నుంచే సైన్స్‌పై అవగాహన కల్పించాలి

ఉండి: చిన్నారులకు బాల్యం నుంచే సైన్స్‌పై అవగాహన కల్పించాలని ఇండియన్ డిజిటల్ స్కూల్ కరస్పాండెంట్ కలిశెట్టి విజయ్‌కృష్ణ అన్నారు. మంగళవారం ఉండి ఇండియన్ డిజిటల్ స్కూల్లో ముందస్తు జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను స్కూల్ ప్రిన్సిపల్ రజనీకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఉద్దేశించి విజయ్ కృష్ణ మాట్లాడుతూ సర్ సివి.రామన్ 'రామన్ ఎఫెక్ట్'ను ఆవిష్కరించిన రోజున సైన్స్ దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి : కలెక్టర్

భీమవరం : జిల్లాలోని పదవ తరగతి విద్యార్థులు నూరు శాతం ఫలితాలను సాధించేందుకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నాగరాణి జిల్లాలోని అన్ని జిల్లా పరిషత్ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమాన్ని గూగుల్ మీట్ ద్వారా నిర్వహించారు. రాజమండ్రి రామకృష్ణ మిషన్ నుంచి స్వామి సేవ్యానంద్ పాల్గొని పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమాన్ని జిల్లా అంతటా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 13 వేల మంది విద్యార్థులకు గూగుల్ మీట్ ద్వారా నిర్వహించడం జరిగిందన్నారు. 1500 మంది ఉపాధ్యాయులు కూడా పాల్గొనడం జరిగిందన్నారు. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో చదివితే సాధించలేనిది ఏమీ లేదని తెలిపారు.

ఎంఎల్‌సి ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

తహశీల్దార్ కనకరాజు

ఆచంట : పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దార్ జి.కనకరాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మూడు పోలింగ్ స్టేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1,895 మంది పట్టభద్రులు ఓటు హక్కును కలిగి ఉన్నారన్నారు. వీరిలో పురుషులు 1,161, మహిళలు 734 ఓటు హక్కు కలిగి ఉన్నారన్నారు. మండల కేంద్రమైన ఆచంటలో మూడు పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు గాను 414, 415 కేంద్రాలు స్థానిక ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనూ, 416 సాయిబాబా గుడి దగ్గర ఎలిమెంటరీ ప్రాథమిక పాఠశాలలోనూ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లోని ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు. ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా 48 గంటల పాటు మద్యం దుకాణాలు మూసివేస్తున్నట్లు ఆయన వివరించారు.

తణుకులో 12 కేంద్రాలు

తణుకు రూరల్ : ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో భాగంగా పట్టణ పరిధిలో 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తణుకు మండల తహశీల్దార్ డివివిఎస్.అశోక్ వర్మ తెలిపారు. తణుకు పట్టణ, గ్రామీణ పరిధిలో 8,536 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. వీరిలో 4,614 మంది పురుషులు, 3,922 మంది మహిళలు ఉన్నారు. గతంలో ఈ పరిధిలో 7 కేంద్రాలు ఉండేవి ఇప్పుడు పట్టణ పరిధిలో ఎస్‌సిఐఎం ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కళాశాలల్లో రెండేసి కేంద్రాల చొప్పున 4 కేంద్రాలు అదనంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

28న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

నరసాపురం : నరసాపురం పురపాలక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 28న శుక్రవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలులో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ సమావేశానికి సకాలంలో కౌన్సిల్ సభ్యులు హాజరు కావాలని ప్రకటనలో కోరారు.

ఎనిమిది మందిపై బైండోవర్

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసులలో పట్టుబడిన 8 మంది పాత నేరస్తులను మంగళవారం స్థానిక మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ తాడేపల్లిగూడెం వారి ఎదుట హాజరుపరచినట్లు తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సిఐ స్వరాజ్యలక్ష్మి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒక సంవత్సర కాలానికి రూ.లక్ష 50 వేల బాండ్ విలువకు బైండోవర్ చేయడమైనదని, వీరు ఈ సంవత్సర కాలంలో ఏ విధమైన నేరం చేసినట్లయితే వారి బాండును అనుసరించి పెనాల్టీతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఎవరైనా మద్యం అక్రమ రవాణా చేసిన, బెల్ట్ షాపులు నిర్వహించిన తమకు తెలియజేయాలని ఆమె ఒక ప్రకటనలో కోరారు.

పట్టభద్రుల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఆర్‌డిఒ దాసిరాజు

ప్రజాశక్తి - నరసాపురం

ఈనెల 27న జరిగే ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. సోమవారం దాసిరాజును ప్రజాశక్తి పలకరించగా పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : మీ పరిధిలో ఎన్ని నియోజకవర్గాలు ఉన్నాయి?

ఆర్‌డిఒ : 3 (నరసాపురం, పాలకొల్లు, ఆచంట) నియోజకవర్గాలు ఉన్నాయి.

ప్రశ్న : ఎన్ని మండలాలు ఉన్నాయి?

ఆర్‌డిఒ : 8 (మొగల్తూరు, నరసాపురం, యలమంచిలి, పాలకొల్లు, పోడూరు, పెనుమంట్ర, పెనుగొండ, ఆచంట)

ప్రశ్న : మీ సబ్ డివిజన్ పరిధిలో ఎన్ని ఓట్లు ఉన్నాయి?

ఆర్‌డిఒ : సబ్ డివిజన్ పరిధిలో సుమారు 27 వేల ఓట్లు ఉన్నాయి.

ప్రశ్న : ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి?

ఆర్‌డిఒ : పాలకొల్లులో పది, నరసాపురంలో ఆరు, పెనుమంట్ర, పెనుగొండ, ఆచంట, పోడూరు, యలమంచిలి మండలాల్లో మూడేసి, మొగల్తూరులో రెండు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

ప్రశ్న : సబ్ డివిజన్‌లో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి?

ఆర్‌డిఒ : సబ్ డివిజన్ పరిధిలోని 33 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

ప్రశ్న : మీ పరిధిలో ఎక్కువ ఏ మండలంలో పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి? ఆ మండలంలో ఎన్ని ఓట్లు ఉన్నాయి?

ఆర్‌డిఒ : అత్యధికంగా పాలకొల్లులో 10 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 7,957 ఓట్లు ఉన్నాయి.

ప్రశ్న : ఏ మండలంలో తక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి? ఆ మండలంలో ఎన్ని ఓట్లు ఉన్నాయి?

ఆర్‌డిఒ : మొగల్తూరులో రెండు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆ మండలంలో 1,757 ఓట్లు ఉన్నాయి.

ప్రశ్న : ఎన్నికలకు ఎంత మంది సిబ్బందిని నియమించారు?

ఆర్‌డిఒ : సుమారు 180 మంది సిబ్బందిని నియమిస్తున్నాము. పోలీస్ సిబ్బంది కాకుండా.

ప్రశ్న : ఎన్ని రూట్లు, ఎన్ని బస్సులు ఏర్పాటు చేశారు?

ఆర్‌డిఒ : మొత్తం ఆరు రూట్లలో ఆరు బస్సులు ఏర్పాటు చేసాము.

ప్రశ్న : సిబ్బంది ఎప్పుడు పోలింగ్ సామాగ్రి అందిస్తారు?

ఆర్‌డిఒ : ఈనెల 26వ తేదీన ఆర్‌డిఒ కార్యాలయంలో పోలింగ్ సామగ్రి పంపిణీ జరుగుతుంది.

ప్రశ్న : ఎన్నిక ఏ సమయం నుంచి ఏ సమయం వరకూ జరుగుతుంది?

ఆర్‌డిఒ : ఈనెల 27వ తేదీన గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.

ప్రశ్న : ఓటర్లకు మీరిచ్చే సూచన?

ఆర్‌డిఒ : ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోండి. ఓటర్లు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డు చూపించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. బిఎల్‌ఒలు ఇచ్చిన స్లిప్‌తో ఆధార్ కార్డ్, ఫొటో ఉన్న పాన్‌కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ తదితర ఏదో ఒక గుర్తింపు కార్డులను వెంట తెచ్చుకోవాలి.

ప్రశ్న : ఎన్నికలకు ఎటువంటి ఏర్పాట్లు చేశారు?

ఆర్‌డిఒ : ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాట్లు చేశాము. తాగునీరు, విద్యుత్, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశాము. వృద్ధులు, వికలాంగులకు వీల్ చైర్స్, పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేశాము.

కార్మిక చట్టాలు అమలు చేయాలి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

తాడేపల్లిగూడెం : మోడీ ప్రభుత్వం కార్మిక, వ్యతిరేక విధానాలను, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, లేబర్ కోడ్లు రద్దు చేసి, కార్మిక చట్టాలను అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. అగ్రికల్చరల్ మార్కెట్ యార్డ్ హమాలీస్, అదర్ వర్కర్స్ యూనియన్(సిఐటియు అనుబంధం) 34వ వార్షికోత్సవం యార్డు యూనియన్ ఆఫీసులో మంగళవారం దేశంశెట్టి సతీష్ అధ్యక్షతన జరిగింది. ప్రజానాట్యమండలి కళాకారులు గీతాలాపన చేయగా యూనియన్ సీనియర్ నాయకులు పోలా చంద్రశేఖర్ సిఐటియు జెండాను ఆవిష్కరించారు. 2024 కార్యకలాపాల నివేదికను కార్యదర్శి దేశంశెట్టి సతీష్ ప్రవేశపెట్టారు. యూనియన్ సభ్యులు నివేదికను ఆమోదించారు. ఈ వార్షికోత్సవాన్ని ఉద్దేశించి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక వర్గం బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు మంచం కోళ్ళ లా తయారుచేసి లేబర్ కోడ్ల పేరుతో కార్మికులను కట్టు బానిసల్లా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని సిఐటియుగా మేము ఖండిస్తున్నామని ఆయన అన్నారు. లేబర్ కోడ్ల పేరుతో కార్మిక చట్టాలలో తీసుకువచ్చిన మార్పులు కార్మిక వర్గ ప్రయోజనాలను కాలరాసి పెట్టుబడిదారులకు దాసోహం అన్న పద్ధతిలో మార్పులు ఉన్నాయని ఆయన ఆందోళన చెందారు. గతంలో యజమానులు కార్మిక చట్టాలు అమలు చేయకపోతే, పిఎఫ్ సకాలంలో కట్టకపోతే, వేతనాలు సకాలంలో పెంచకపోతే, వేతనాల్లో కోతలు పెడితే, ఉండే శిక్షలు మోడీ ప్రభుత్వం పూర్తిగా రద్దు చేస్తుందని ఆయన అన్నారు. కార్మికులు జన్మహక్కుగా భావించే సమ్మె హక్కును నిర్వీర్యం చేస్తుందని, యూనియన్ పెట్టుకోకుండా, ఏ హక్కు లేకుండా చేస్తుందని ఆయన అన్నారు. రాజ్యాంగ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరిగే విధానాన్ని రద్దుచేసి, యజమానులు తొత్తులను యూనియన్ నాయకులుగా పెట్టే పద్ధతిలో ఈరోజు కార్మిక చట్టాలలో మార్పులు తెస్తుందని ఆయన తెలిపారు. 45 కోట్ల మందిలో తొమ్మిది కోట్ల మందికే కొన్ని అయినా చట్టాలు ఉన్నాయని, 36 కోట్ల మందికి అసలు ఎటువంటి చట్టాలు కూడా లేవని ఆయన స్పష్టం చేశారు. హమాలీ చట్టం ఉన్నా ఎటువంటి ప్రయోజనం లేదని, ప్రమాదం జరిగితే పట్టించుకునే దిక్కు లేదని, ఉన్న హక్కులను కాలరాసే మోడీ ప్రభుత్వం ఈ దేశానికి తిండి పెట్టే వాళ్ళు, దేశానికి సంపద పోగుచేసే వాళ్లకు ఎటువంటి ప్రయోజనాలు లేకుండా, పెట్టుబడిదారులకు, అంబానీ, అదానీలకు దేశ సంపద మొత్తం దోచిపెట్టే విధంగా మోడీ ప్రభుత్వం ఉందని ఆయన అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశంలో ఉన్న అన్ని కార్మిక, ఉద్యోగ సంఘాలను కలుపుకొని నిరువధిక సమ్మె చేయడానికి అయినా కార్మికవర్గం సిద్ధమని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, మున్సిపల్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి దనాల వెంకటరావు, సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జవ్వాది శ్రీను, పెంటపాడు మండల నాయకులు చిర్ల పుల్లారెడ్డి పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన కలిగి ఉండాలి

డిపిఆర్‌సి రిసోర్స్ కోఆర్డినేటర్ ఎడ్వర్డ్

తాడేపల్లిగూడెం : గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే కార్యదర్శులకు తడి చెత్త, పొడి చెత్తపై పూర్తి అవగాహన కావాలని డిపిఆర్‌సి రిసోర్స్ కోఆర్డినేటర్ ఎడ్వర్డ్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం మండల పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోడల్ ఎస్‌డబ్ల్యు పిసి జగన్నాథపురంలో తడి చెత్తను, పొడి చెత్తను వేరుచేసి తీసుకురావడం నుంచి వర్మి తయారు చేయడం, పొడి చెత్తను సెగ్రిగేషన్ చేసి విక్రయాలు చేయడం, తదితర అంశాలను, అక్కడ ఎదుర్కొన్న సవాళ్లను, కార్యదర్శుల సందేహాలను నివృత్తి చేశారు. ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్, మండల పంచాయతీ విస్తరణ అధికారి ఎం.వెంకటేష్, సర్పంచి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఆకివీడు : ఈనెల 27వ తేదీ గురువారం జరగనున్న మండలి ఎన్నికలలో పట్టభద్రులు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు కోరారు. ఆమేరకు స్థానిక సరోజినీ నాయుడు జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో ఎన్నికల బూతు ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. ఇదే ప్రాంగణంలో మూడు బూతులు ఉన్నాయన్నారు. 384, 385, 386 నెంబర్లు గల మూడు బూతులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ బూత్లలో మొత్తం 2,046 మంది పట్టభద్రులైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1,211 మంది పురుషులు, 835 మంది స్త్రీలు ఉన్నారని చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు పోలింగ్ జరుగుతుందని చెప్పారు.

బెస్ట్ సర్వీస్ అవార్డుకు ఆర్‌టిసి సూపర్‌వైజర్ విజయకుమార్ ఎంపిక

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ఆర్‌టిసి సేవల్లో భాగంగా బెస్ట్ సర్వీస్ అవార్డును ఆర్‌టిసి సూపర్‌వైజర్ విజయకుమార్ అందుకున్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ చేతుల మీదుగా స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో మంగళవారం బెస్ట్ సర్వీస్ అవార్డు అందజేసి సత్కరించారు. 6 మండలాల్లో వికలాంగులకు బస్‌పాస్‌లను,(వికలాంగుల బస్సు పాస్ మేళా ద్వారా) వారికి అందజేసినందుకు, పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు, అందజేయడం ద్వారా చేస్తున్న సేవలకు, దొంతల విజయ్ కుమార్‌కు ఈ అవార్డు వరించింది.

శివరాత్రి ఉత్సవాలకు బందోబస్తు : ఎస్‌పి

నరసాపురం: కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లతో భద్రతా పరంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలని ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి అన్నారు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో శ్రీదుర్గా లక్ష్మణేశ్వర స్వామి ఆలయాన్ని ఎస్‌పి పరిశీలించారు. మహాశివరాత్రి ఉత్సవాలలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు జిల్లా పోలీస్ శాఖకు సహకరించాలని అన్నారు. తోపులాటలు వంటి ఘటనలు జరగకుండా భక్తుల రద్దీకి అనుగుణంగా క్రౌడ్ కంట్రోల్ చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, ట్రాఫిక్ డైవర్షన్ తదితర వివరాలను తెలియజేస్తూ దేవాలయ పరిసర ప్రాంతాలలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఎస్‌పి కోరారు. జిల్లా అదనపు ఎస్‌పి(అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, ఇఒ ఆర్‌విఎస్.రామచంద్ర కుమార్ పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : మహాశివరాత్రి సందర్భంగా భీమవరంలో ప్రముఖ గురుపూడి పంచారామ క్షేత్రాల్లో ఒక్కటైన సోమేశ్వర ఆలయం వద్ద ఏర్పాట్లను జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి మంగళవారం పరిశీలించారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్ పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి, డిఎస్‌పి జై.సూర్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజమే ధ్యేయం : సిఐ

భీమవరం టౌన్ : ప్లాస్టిక్ రహిత సమాజమే ధ్యేయంగా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, ప్రజలందరూ భాగస్వాములై ప్లాస్టిక్‌ను విడనాడి, ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని భీమవరం టు టౌన్ సిఐ కాళీచరణ్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం పురపాలక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్లాస్టిక్ నిషేధ అవగాహనా ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం కార్మికులతో ఉచిత వస్త్ర సంచులు(గుడ్డ) పంపిణీ కార్యక్రమాన్ని పట్టణంలోని నానాజీ ఎంటర్‌ప్రైజెస్ ప్రాంగణంలో నిర్వహించారు. సుమారు 100 మంది బంటా కార్మికులకు ఉచిత వస్త్ర సంచులు(గుడ్డ) పంపిణీ చేసామని, దీనికి స్పందించి తటవర్తి భాస్కరరావు అండ్ సన్స్ అధినేత తటవర్తి పెదబాబు వెయ్యి వస్త్ర సంచులకు సౌజన్యం అందించారని తెలిపారు.

సూర్యఘర్ ప్రయోజనాలపై ప్రచారం చేయాలి

భీమవరం : ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనతో ప్రయోజనాలపై విస్తృత ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ప్రజలకు సోలార్ ప్యానల్ ఏర్పాటుపై మరింత అవగాహన కల్పించి లక్ష్యాలను అధిగమించాలన్నారు. అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేటులో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం అమలుపై విద్యుత్తు శాఖ అధికారులు, బ్యాంకర్లుతో జిల్లా కలెక్టర్ సమీక్షించి మాట్లాడారు.

In The Court Of The Principal Civil Judge (Junior Division) Cum Judicial 1st Class Magistrate: Narasapuram
I.A.No.419/2018 in O.S.No.18/2017

Between:
గమిడి బాబ్జి S/o నరసింహమూర్తి
సరిపల్లి నర్సాపురం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
... Petitioner/Plaintiff
Vs
కేదాసు రమ కాసు మని వగైరా
... Repondents/defendents/proposed parties
Proposed parties:
R7) మేక మని, భర్త: రత్నంరాజు, సరిపల్లి గ్రామం, నర్సాపురం మండలం, ప॥గో॥జిల్లా.
R10) చింత రత్నంరాజు, తండ్రి: జాన్సన్, సరిపల్లి గ్రామం, నర్సాపురం మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు గల దావాలో Petitioner/Plaintiff మిమ్మల్ని దావాలో పార్టీగా చేర్చమని కొరుచూ పిటీషను దాఖలు చేయగా మీకు శ్రీ కోర్టువారు ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికిని మీరు తీసుకోనందున శ్రీ కోర్టువారు పేపర్లో ప్రకటనకు ఆర్డర్ వేసియున్నారు.

కావున పై నెంబరు దావాలో **ది. 03-03-2025 సం.రం. ఉదయం 10-30 ని॥లకు** మీరు గాని, మీ అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క అక్షేపణలు తెలియపరచుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(by court order)
వాయిదా తేది: **03-03-2025**

R. Pullaji M.A.,B.L.
Advocate,
Narsapuram
Narsapuram
Dt. 25-02-2025
Cell: 98493 00413

ప్రకటన

యావన్మందికి తెలియచేయునది ఏమనగా నా క్లయింటు పశ్చిమగోదావరి జిల్లా , భీమవరం మండలం, భీమవరం గ్రామ కాపురస్తులు **శ్రీమతి నేతల ఉషాభారతి W/o.** నేతల రమేష్‌బాబు తాలుకూ ఒరిజినల్ లింకు డాక్యుమెంటు అనగా రిజిష్టర్డు (సేల్ డీడ్) క్రయదస్తావేజు **తేది. 29.09.1997 DOC No. 3868/1997.** నక్కా బెన్జీ బాబు గారికి, బీరా ప్రసాదరావు గారి భార్య **సమాధానం** మరియు తదితరులు వ్రాయించి ఇచ్చిన క్రయదస్తావేజును సదరు **శ్రీమతి నేతల ఉషా భారతి గారు** భీమవరం మెంటేవారితోటలోని తన ఇంటి వద్ద నుండి తన యొక్క బ్యాగులో పెట్టుకుని జిరాక్స్‌షాపునకు తీసుకుని వెళ్తుండగా సదరు బ్యాగు కనిపించకుండా పోయినదని తెలియచేసినారు.

కావున సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల వెంటనే ఈక్రింది ఉదహరించిన చిరునామాకు తెలియపరచి తగు పారితోషికము పొందవలసిందిగా యావన్మందికి తెలియ చేయడమైనది.

సం// **కంచిరాజు వెంకటరావు**
అడ్వకేట్ , భీమవరం
భీమవరం
తేది.25.02.2025 సెల్ : 9849663272

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్- జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ పస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 311/2021

బిట్వీన్:
బ్యాంకు ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, నరసాపురం **-వాది**
అండ్
నిల్లా గిరిజ దుర్గ అండ్ అనదర్ **-ప్రతివాది/ప్రతివాదులు**

సమన్స్ టు:
D-1: నిల్లా గిరిజ దుర్గ, W/o. శ్రీను, డోర్ నెం. 3-25, అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ పస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 07-03-2025 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది: 25-02-2025 ఫోన్: 08814-274628

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్- జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ పస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 301/2022

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం **-వాది**
అండ్
పజ్జూరి రమేష్ అండ్ అనదర్ **-ప్రతివాది/ప్రతివాదులు**

సమన్స్ టు:
D-1: పజ్జూరి రమేష్, S/o. మల్లేశ్వరరావు, డోర్ నెం. 5-23, 4th బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: పజ్జూరి మోహనరాణి, W/o. రమేష్, డోర్ నెం. 5-23, 4th బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్- జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ పస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 26-03-2025 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది: 25-02-2025 ఫోన్: 08814-274628

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్- జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ పస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 331/2022

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం **-వాది**
అండ్
మిద్దే సాయిలక్ష్మి అండ్ అనదర్ **-ప్రతివాది/ప్రతివాదులు**

సమన్స్ టు:
D-1: మిద్దే సాయిలక్ష్మి, W/o. గోపాలరావు, డోర్ నెం. 7-15, అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల సూర్యవంశీధర్, W/o. చంద్రశేఖర్, డోర్ నెం. 4-109, గగ్గిపర్రు H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్- జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ పస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 07-03-2025 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది: 25-02-2025 ఫోన్: 08814-274628

శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ఆచంట : ఈనెల 26న మహాశివరాత్రి పురస్కరించుకొని ఆచంట రామేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. ఈ ఉత్సవాలు నిర్వహించినందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మహాశివరాత్రికి స్వామి వారిని దర్శించుకునేందుకు యాత్రికులు ఇబ్బందులు పడకుండా ఆలయం చుట్టూ క్యూలైన్ ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆదిమూల వెంకట సత్యనారాయణ తెలిపారు. ఉత్సవంలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం శ్రీరామేశ్వర స్వామి కళావేదికపై శ్రీలక్ష్మీ గణపతి బుర్రకథ బృందం ప్రదర్శించిన స్టేజీ డ్రామా ఎంతో ఆకట్టుకుంది.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

శివరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సాధించినట్లు పంచాయతీ కార్యదర్శి జి.నరసింహారావు తెలిపారు. ఉత్సవాలు దృష్టిలో ఉంచుకుని తాత్కాలికంగా 15 మంది అదనపు సిబ్బందితో పాటు చెత్త సేకరణకు అదనపు ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆచంట రామేశ్వరస్వామి ఆలయం సమీపంలో తాత్కాలికంగా క్యాంప్ ఆఫీసును ఏర్పాటు చేసి, సిబ్బందిని అందుబాటులో ఉంచామని తెలిపారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామన్నారు. యాత్రికులకు ఇబ్బందులు లేకుండా తాత్కాలిక మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక కచేరీ సెంటర్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా స్థానిక కేకే స్ట్రీట్ రామాలయం వద్ద ఆటోలు, ఇతర ప్రయివేటు వాహనాలు నిలుపుదల చేయాలని పోలీసులకు వివరించారు. పెనుగొండ సిఐ ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్‌ఐలు, 50 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ కె.వెంకటరమణ తెలిపారు.

పెనుమంట్ర: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని ప్రముఖ శివక్షేత్రాలు నత్తారామేశ్వరం, జుత్తిగలో బుధవారం జరిగే అభిషేక ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. మంగళవారం నత్తా రామేశ్వరంలోని రామేశ్వర స్వామి ఆలయం వద్ద గడచిన నాలుగు రోజులుగా గ్రామ కార్యదర్శి నేలపాటి సుధారాణి దగ్గరుండి పంచాయతీ సిబ్బందితో అన్ని పనులు చేయించారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షణ చేస్తున్నారు.

గ్రామపంచాయతి కార్యాలయం, ముదినేపల్లి
టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి. నెం. 12/2025 తేది.25-02-2025

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, ముదినేపల్లి గ్రామపంచాయితీకి ది. 01-04-2025 తేది నుండి ది. 31-03-2026 వరకు అనగా 1సం॥ కాలమునకు ఈ దిగువ తెలిపిన పనులకు కాంట్రాక్ట్ లేబరును సప్లయి చేయిటకు ది. 06-03-2025 తేది సాయంత్రం 3.00 గం॥లకు ముదినేపల్లి గ్రామపంచాయితీ కార్యాలయం నందు పంచాయితీ టెండర్లు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు స్వీకరించబడి తిరిగి అదేరోజు సాయంత్రం గం॥ 3.30 ని॥లకు హాజరు కాబడిన టెండరు దారుల సమక్షములో టెండర్లు తెరవబడును. మిగిలిన వివరములు కార్యాలయ పనివేళల యందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరములు	కాలము	డిపాజిట్ మొత్తం
1	పి.హెచ్.సి నిర్వహణ స్వీపింగ్, మురుగుకాల్వలు క్లీనింగ్ మరియు గ్రామములో చెత్త తరలించుట.13 మంది	01-04-2025 నుండి 31-03-2026 వరకు 1 సం॥ కాలము	రూ॥ 5000/-
2	ఆర్.డబ్ల్యు.ఎస్ స్కీమ్స్ నిర్వహణ - 2 ఇద్దరు		
3	ఎలక్ట్రీషియన్ - 1 వీధి దీపములు రిపేరు చేయుట		
4	పారిశుధ్య ట్రాక్టరు, వ్యాను డ్రైవర్లు - 2 ఇద్దరు మొత్తం : 18 మంది		

సం/- **శ్రీమతి నిమ్మగడ్డ కైకమ్మ**
సర్పంచ్, ముదినేపల్లి గ్రామపంచాయితి

సం/- **శ్రీ జి. రమేష్**
పంచాయితి కార్యదర్శి, ముదినేపల్లి గ్రామపంచాయితి

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్- జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ పస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 183/2022

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం **-వాది**
అండ్
కట్టా పద్మావతి అండ్ అనదర్ **-ప్రతివాది/ప్రతివాదులు**

సమన్స్ టు:
D-1: కట్టా పద్మావతి, D/o. వెంకటేశ్వరరావు, డోర్ నెం. 5-104, 4th బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: కట్టా మురళి, S/o. వెంకటేశ్వరరావు, డోర్ నెం. 5-104, 4th బ్లాకు, గగ్గిపర్రు H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్- జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ పస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 26-03-2025 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది: 25-02-2025 ఫోన్: 08814-274628

ప్రకటన
మహారాజశ్రీ అడిషినల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్- అడిషినల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ పస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 296/2023

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం **-వాది**
అండ్
ఆరేపల్లి వెంకటరత్నం అండ్ అనదర్ **-ప్రతివాది/ప్రతివాదులు**

సమన్స్ టు:
D-1: ఆరేపల్లి వెంకటరత్నం, S/o. ఆదినారాయణ, డోర్ నెం. 2-30, 4th బ్లాకు, గగ్గిపర్రు, అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల బాలఫణి, S/o. యర్రయ్య, డోర్ నెం. 4-120, 4th బ్లాకు, గగ్గిపర్రు H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ అడిషినల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్- అడిషినల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ పస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 12-03-2025 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది: 25-02-2025 ఫోన్: 08814-274628